# ఆంధ్రదేశమున వేదప్రచారము

శ్రీ పెండ్యాల వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి

**2**

రాజనరేంద్రుని పౌత్రుడగు వీరచోడుడు, నానావిధ వేదశాస్త్రముల జదివిన 563 మంది బ్రాహ్మణులకు మూడగ్రహారము లిచ్చిన 'పిఠాపుర శాసనము,' అఱువదిమందిపై యట్టి బ్రాహ్మణులకే 'ఏరుపల్లి' అను గ్రామమును దానమిచ్చిన మల్ల విష్ణువర్ధనుని శాసనమును; నీటివల్ల ఈ యాంధ్ర దేశమున వేద ప్రచారమున కెట్లు ప్రాచీన ప్రభువులు ప్రోత్సాహ మిచ్చినదియు విశదము కాగలదు. తెలింగాణము 'జైన' శైవమతములకు క్రీ.శ. 10–14 శతాబ్దములలోను, ఇటీవల 'మహామ్మదీయమతము'నకు రాజ్యత్వ మొసగినను ప్రాచీనకాలముననే, తనలోని గోదావరీ తీరము నాశ్రయించిన వేద విద్యను (తైత్తిరీయ శాఖను) వేరులు పారునట్లు దృఢముగ బట్టి యుంచిన దనుటకు 'మంథెన' 'చెన్నూరు' 'ధర్మపురి' మొదలగు స్థలములలో మొన్నమొన్నటి వరకు ప్రసిద్ధికెక్కిన 'ఘనపాఠీల' సంఖ్యయే నిదర్శనము.

ఆంధ్రమాత వేద విద్యను గన్నతల్లి యనుటకును వేదము లన్నిటికి 'సాయనాచార్యులు' వారు బుక్క మహీపతి కాలమున క్రీ. శ. 1340-70 సం. జగత్ప్రసిద్ధిగన్న భాష్యములు వ్రాసిరనుట కంటె విశేష మేమి వ్రాయవలెను! ఏదేని యొక గ్రంథమును కృతినొందిన మహారాజును చాల ఘనముగ మనము ప్రశంసింతుము—కాని బుక్క మహీపతియో—ఒకటియా! రెండా! నాల్గు వేదములు, పెక్కు బ్రాహ్మణములు ఆరణ్యకములు, ఉపనిషత్తులు, పూర్వమీమాంస, ఉత్తర మీమాంసా శాస్త్రములుఇంక నెన్నియో మహాగ్రంథములను, భాష్యములను స్వనామాంకితములుగా జేయించు కొనెను. ఇట్టి మహీపాలుని 'మాధవాచార్యుల'వారు ఎట్లు తమ గ్రంథాదుల సంకిత మొనర్చిరో చూడుడు:

"యస్య నిశ్వసితం వేదాః
యో వేదేభ్యోఽఖిలం జగత్
నిర్మమే త మహం వందే
విద్యా తీర్థం మహేశ్వరం."
"తత్కటాక్షేణ తద్రూపం
దధ ద్బుక్క మహీపతిః
ఆదిశ న్మాధవాచార్యం
వేదార్థస్య ప్రకాశనే."

"ఎవని నిశ్వాసమే వేదములో, ఎవడు వేదముల చేతనే జగత్తును సృష్టించెనో, అట్టి విద్యాతీర్థుడగు మహేశ్వరునకు వందన మొనర్తు. ఆ విద్యాతీర్థ మహేశ్వరుని కటాక్షము చేతను, ఆతని (దేవుని) స్వరూపమునే బుక్క మహీశుడు పొంది యుండెను. ఆ రాజు మాధవాచార్యుని (నన్ను) వేదార్థమును ప్రకాశింప జేయ నాజ్ఞాపించెను".

ఇట్లు కృతుల నొందిన బుక్కభూపతి కంటె నదృష్టవంతు డెవడు? బుక్క రాయలయొక్క పుత్రుడగు రెండవ హరిహరరాయల కాలముననును వేదశ్రౌత గ్రంథము లమితముగా నా రాజ్యమున వృద్ధిగాంచెను. తాలికోట యుద్ధానంతరము పశ్చిమాంధ్రముననుతెలింగాణముననుు వేదాభివృద్ధి యంతగా కాన్పింపదు. కాని గోదావరీ, కృష్ణానదీ ముఖద్వారములను (నేటి కృష్ణా, గోదావరీ మండలములు) తత్రత్యులగు ప్రభువుల పోషణములచే 'వేద వేదాంగ విద్యలు' అమితముగ వృద్ధి నొందినవి. 'శ్రౌత, స్మార్త' క్రియలకు సంబంధించిన 'అనుక్రమణికలు, పద్ధతులు, వృత్తులు, భట్టీయములు' పెక్కు పనులు గ్రంథాలు, పండితులచే పై ప్రదేశములలో రచింప బడినవి. ప్రాచీన కాలము నుండి నేటివఱకు మా 'కోనసీమ'లో అమలాపురము, రాజోలు తాలూకాలు, ప్రతి సంవత్సరము ఒకటి రెండు మహాయజ్ఞములు చేయబడును, వేద విద్యయొక్క యుపయోగము చూపబడుచునే యున్నది.

కాని యీ శతాబ్దాది నేబది మొదలు రెండు వందల వేద పండితు లుండిన కోనసీమాగ్రహారములలో నేడు నూటికి తొంబదిమందివఱకు వేదవేత్తలు తగ్గిపోవుట మాత్రము విచారకరము. కర్నూలు మండలము చాలకాలము మహమ్మదీయులచే బాలింప బడినను, 'వెలుగోడు, కురుకుంద, కలిదేను' మొదలగు నా మండల గ్రామములలో ఇప్పటి కిరువ దేండ్లకు పూర్వముః అను 'అధ్వర్యవము, హౌత్రము, ఔద్గాత్రము' మొదలగు శ్రౌతభాగములను వల్లించు 'విద్యార్థులు' చెప్పెడి గురువులు కలిగి యుండుట జూచి ఆశ్చర్యా సందముల నొందితిని.

గత శతాబ్దాంతమువఱకు గోదావరీ మండలము 'వేద వేదార్థములం' జెప్పుటకును, 'కృష్ణా మండలము' 'శ్రౌత కర్మముల' జేయించుటకును దగిన పండితు లున్నా రని ప్రసిద్ధి నొందినవి.

గోదావరీ మండల పండితులకు 'పెద్దాపుర సంస్థాన ప్రభువులను శ్రీవత్సవాయి గజపతులు' ఇచ్చిన మాన్యక్షేత్రము లమితములు. 'బోధాయన మహర్షి" మొదలు 'తెనాలి రామకృష్ణకవి' వఱకు అబ్రాహ్మణదేశము, అవి నీలికర దేశము అని నిందింప బడిన 'కళింగాంధ్రము' (నేటి విశాఖ పట్టణపు జిల్లా) కళింగ గజపతుల కాలమువఱకు వేద వేత్తలు నివసించినట్లు కాన్పింపదు. 'ఖారవేలుడు' (క్రీ. పూ. రెండవ శతాబ్ది) మొదలు గజపతుల పాలనము (క్రీ. శ. 16 వ శతాబ్ది) వరకు తత్రత్య ప్రభువులొనర్చిన దానధర్మాదులు 'జైనులకో, బౌద్ధ వైష్ణవదేవతలకో' గాని వేదశ్రౌతశాస్త్రపండితుల కొనర్చినట్లు కాన్పింపదు. (చూ. సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్సు 4,5,10 వాల్యుం) కాని కళింగగజపతులు వేదవేదాంగములను నేర్చిన పండితులకు అగ్రహారాదుల నీయ నారంభించిరి.

పిమ్మట (క్రీ. శ. 16, 17, 18 వ శతాబ్దములలో) దానవీరులలో ప్రసిద్ధింగన్న పెద్దాపుర సంస్థాన ప్రభువులకు పోటీ పడిరా యనునట్లు, విజయనగర సంస్థాన ప్రభువులగు శ్రీ పూసపాటి గజపతులు తమ రాజ్యమునకు కృష్ణా గోదావరీ మండలముల నుండి వేదశాస్త్ర పండితులను అమితముగ రప్పించి, బహుళాగ్రహారముల నొసంగి వేదశాస్త్ర విద్యల నభివృద్ధి పఱచిరి.

పదునాఱవ క్రైస్తవ శతాబ్దమున చంద్రగిరి ప్రభువగు వీరవెంకటపతి రాయలవారు గోదావరీ మండలములోని 'ముంగొండ' గ్రామము నుండి మహాశ్రౌతులగు 'ఉపద్రష్ట'వారి కుటుంబములకు తన రాజ్యములోని 'మదుగుబేడు' అను నగ్రహారమును (వేలూరుజిల్లా, చెయ్యేరు తాలూకా) ఒసంగి, శ్రౌతవిద్య నభివృద్ధి నొందించుటయు, ఇంచుమించుగ నా కాలముననే నర్మదానదీ తీరమున రాజ్యమేలుచుండిన 'దుర్గావతి'కి మహారాణి 'ఏలూరు' ప్రాంత వాసులగు 'పోతుకుచ్చి' వారి కుటుంబములను (శ్రౌతులు) రప్పించి 'హుసంగవాదా' జిల్లాలో నైదగ్రహారము లిచ్చుటయు గమనార్హములు. 'మదుగుబేడు, హుసంగవాదా' ప్రాంతములలో పై పండిత కుటుంబముల వారు నేడును వృద్ధిదశలోనే యుండి ఆంధ్రత్వమును జాటుచునే యున్నారు.

గత శతాబ్దముయొక్క చివరి భాగము మొదలు ఈ శతాబ్దాది వఱకు గంజాము మండలములోని 'ఉర్లాం' సంస్థానమును పాలించిన కందుకూరి బసవ రాజుగారును, ఆయన కోడలు మహాలక్ష్మమ్మగారును, ప్రతి సంవత్సరము శ్రావణ పూర్ణిమకు వందలకొలది వేదవేత్తలను పరీక్ష చేయించి 'వర్షాశనములు' ఇచ్చుచుండువారు. ఆ యుర్లాము పరీక్షకై కృష్ణా, గోదావరీ మండలముల నుండియేగాక 'మంథెన' వంటి దూరదేశముల నుండి కూడ వేదవేత్తలు వచ్చుచుండుట నాకు దెలియును.

ఇప్పుడును కాకినాడలో శుక్ల యజుర్వేద పాఠశాలయు, బందరు మొదలగు స్థలములలో మరి కొన్ని పాఠశాలలును వేదవిద్యను స్వల్పముగా నభివృద్ధి నొందించు చున్నవి.

ఋగ్వేద మీ దేశమున దొల్లి ప్రచారమున లేకుండె ననియు క్రీ. శ. పదవ శతాబ్దమున 'మహమ్మదు గజనీ' దండ యాత్రలకు వెఱచి కచ్ఛాఖ్య బ్రాహ్మణులు ఆంధ్ర దేశమునకు వలస వచ్చినారనియు డా. కృష్ణస్వామి అయ్యరు గారు వ్రాసియున్నారు. 'నందవరీక చరిత్ర' 'చాముండికా విలాసము' అను నాంధ్ర గ్రంథములలోని కథలు పై వలసవచ్చు గాథలను స్థిరపఱచు చున్నవి.

మా పిఠాపురమున నింతకు పూర్వము కృష్ణ యజుర్వేదమునకే ప్రచారము, ప్రాముఖ్యము నుండెడిది కాని, వ్యాకరణ శాస్త్ర వేత్త కని కీ. శే. అవసరాల కామరాజుగా రిచ్చిన భూమిని ప్రస్తుతము వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు స్వాధీన పరచుకొని తత్ఫలితమును ఒక 'ఋగ్వేదవేది' కొసంగుచు ఋగ్వేద ప్రచారమున కుద్యమించుట ప్రశంసనీయము. కాని, ఆయన కుటుంబము లోనివారు మాత్రమే ఆ 'వేదవేది' వల్ల లాభము నొందుచున్న ట్లున్నది.

నూటికి తొంబది మంది తైత్తిరీయ శాఖీయులుండుటచే ఋగ్వేద మిట నెట్లభివృద్ధి నొంద గల్గును?

ఆంధ్ర దేశీయులు వైదిక గ్రంథముల ప్రచురింప నంతగా ప్రయత్నింపలేదు. కాని గత శతాబ్దాంతమున మున్నవ బుచ్చయ్య పంతులు,అమ్మాది లక్ష్మీనరసింహ సోమయాజిగార్లు కొన్ని వేద గ్రంథముల బ్రచురించిరి. ఇపుడు 'వినయాశ్రమము'వారు కొన్నిటిని బ్రచురించు చున్నారు. ఈ ప్రచారకులలో శుక్ల యజుర్వేద (కాణ్వ శాఖ) సంహితా బ్రాహ్మణములను ప్రచురించిన మన్నిత్రులును, కీ. శే. శేషులునగు భాగవతుల లక్ష్మీనరసింహ శాస్త్రిగారి పరిశ్రమము మాత్ర మతిశ్లాఘ్యమైన దనియు, అనన్య సామాన్యమైన దనియు, జెప్పవలసి యున్నది. శాస్త్రిగారి ప్రబోధముచేతనే ఈ యాంధ్ర దేశమున పెక్కు చోటులందు 'యాజ్ఞవల్క్య' జయంతులు చేయబడుచున్నవి. ఇతర వేదశాఖలవారట్టి జయంతుల జోలికి పోకపోవుటకూడ విచిత్రము.

వేదమాత ఆంధ్ర దేశమున సుస్థిరమై యుండ బరమేశ్వరు డనుగ్రహించుగాక!

---

# బమ్మెర పోతన

(10-వ పేజీ తరువాయి)

కవి! నాకంటే గట్టిపండితుడు, వాగ్మి, పూర్ణ ప్రజ్ఞావంతుడు! ఎక్కడికెళ్లినా అందర్నీ హడలగొట్టి నెగ్గొచ్చే మహా చమత్కారి. నన్నట్లా అమర్యాదచేసిన సింగమనీణ్ణి బోర్ల దోసిన మేధావి. అన్నీ బాగున్నాయ్ కాని, విషయలోలుడు కావడంచేత ధనార్జనకోసం కట్టుదప్పి ప్రవర్తించాల్సి వచ్చినవాడు. అట్లాటి వాళ్ళుంటారు, కొందరెప్పుడూ. ఎట్లాటెట్లాటి వాండ్లూకూడుండే లోకమాతుండా!

నే: చిత్తం. తమరంటే వారికి చాలా భక్తండీ.

పో: (అల్పసంతోషితనం) అట్లాగా! ఏమన్నా డేమిటి?

నే: తమర్ని మహా పొగిడారు. అమాయకులు, పరమభక్తులు, నిర్లిప్తులు అన్నారు.

పో: అదే పదివేలు. నా కంతకన్నా అతనేమీ యివ్వలేడు.

నే: తమరు "కాటుక కంటినీరు..." అని చెప్పారంటారే ఆ దృశ్యం సత్యంగా దమకు తోచిందేనా?

పో: మావాడి కీర్తన విన్నా వేమిటో యట్లా గడిగావ్. నానోట అబద్ధం రాదు. నా కా మహాదేవి యెప్పుడూ కన్పడుతూంటుంది. ఆమె ఆరోజట్లా గనబడ్తే ఆశువుగా ఆ పద్యం వచ్చింది.

నే: ఆ పద్యం విని సింగమనీడు తమ కట్లం చేసాడేమో!

పో: ఏమో ఐయుండొచ్చు. అయితే మావాడట్లా గన్నాడని చెప్తాడా?

నే: ఉండండి, ఎవరుండగా జెప్పా రా పద్యం?

పో: (కొంచె ముండి) భాగవతా న్నాయన తన కిమ్మని అడగవచ్చినరోజున, భోజనానంతరం సావిట్లో తాంబూలం వేసుకుంటూ కూర్చున్నప్పుడు-ఆ అప్పుడు ఆయన శిష్యు లిద్దరున్నారు.

నే: ఇంకేం ఇద్దర్లో యెవడో ధారణబట్టాడు. వెల్గొండలో వెళ్ళబెట్టుంటాడు: ప్రగల్భంగా తమకెకథంతా చెప్పా డేమో కూడా. గత్వాగత్వా వాడి చెవిదాకా పాకుంటుంది. వాడు కచ్చబట్టి మిమ్మల్ని రప్పించే నటన జరిపి అంతపని చేసుంటాడు.

పో: కావచ్చునాయనా; నేను తొందర్పడే కొను.

నే: మీ నియోగ మేమైందండీ!

పో: నాయనా, అనుష్ఠానం పొలం దున్నుకోవడం తప్ప మరొక వ్యవహార మెరుగని నాకు కొక్కమెట్లా వుంటుంది! అనంతా మావాడి సొమ్ము. నేను కుదవైతీకేసి.

నే: అయితే మటు కంత గ్రంథాన్నట్లా చేస్తాడా వాడు! మాకాలంలో నైతేనా?—

పో: పోనీ నాయనా! నీ వన్నట్లు ఇప్పుడేమనుకు నేం లాభం?

నే: పోనీ మళ్లీ రాయక పొయ్యారా?

పో: ఛీ! అంతకష్టం నేల పాలైందిగదా నని నిరుత్సాహం దోచి తలపెట్టలా. ఘంటం పట్టుకుంటే ఆగేదికాదు కాని నాకు మళ్లీ బుద్ధి పుట్టలా.

నే: ఇం కేదన్నా—

పో: రచనకే మనస్సెక్కలా.

నే: తమరు లిక్కన రాసాడుగాని భారతాన్ని బండి కెత్తిదున్నారా?

పో: ఏమిటీ, నేనా! రామరామ! భారత విషయ మెక్కడ, నారచన మెక్కడ? దాని గ్గావలసిన బండారం నాకులేదు.

నే: భాగవతానికి గ్గావలసింది మరెవ్వరికీ లేదు.

పో: ఆ విషయం నాకు తెలీదు. నాకు మటుకది లేదు.

నే: (గుండె కొట్టుకుంటూ) ఎంత అమాయకులకు, వినయవంతులకు, మహానుభావులకు ఎంత ఆపద వచ్చిందండీ!

పో: కర్మం. గంగాస్నానం వేళౌతూంది; వెళ్తా.

నే: నాకు పునః పునః దర్శనభిక్ష కటాక్షించండి.

పో: అట్లాగే నాయనా; అయినా యెందుకు ఈ పాపలోకాని కొట్టే రప్పించకు. నీ ఉపాసనాశక్తి బలవత్తరమైంది.

(నిష్క్రమణ)

---


## నెరిసిన వెంట్రుకల ఔషధము

రంగు పూయనక్కరలేదు. ఆయుర్వేదచికిత్స. తెల్లని రంగును మార్చి శాశ్వతముగా వెంట్రుకలకు నలుపు నిచ్చును. గుణం కాపిచో, డబ్బు వాపసుచేయబడును. తెలుపు కొంచమై యుండిన రూ 2-8-0 మధ్యరకమై యుండిన రూ 3-8-0 పూర్తిగా యుండిన రూ 5-0-0.

గమనింపు:—ఇది మెదడుకు కంటికి మంచి పోషణ నిచ్చు ఔషధము.

**Kesh Ranjan Aushadhalaya,**
M. 63, P.O. Ranigani (Burdwan.)